ప్రజాశక్తి


గురువారం 30 మే 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

బిజెపితో నష్టమెవరికి?



- రెండు పార్టీల్లోనూ ఓటింగుపై తర్జనభర్జనలు
- తెలుగుదేశం నేరుగా పొత్తు.. వైసిపి అంతర్గత చెలిమి
- ముస్లిం, మైనార్టీల ఓట్లపైనే చర్చ..
- కాంగ్రెస్‌కు స్వల్పంగా పడ్డట్లు అంచనా

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉత్తర భారతదేశంలో జరిగిన పోలింగ్‌లో బిజెపికి అనుకున్నంతగా సానుకూలత లేదనే చర్చ సాగుతోంది. ఆఖరు దశ పోలింగుకూ సర్వసన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో బిజెపితో పయనం వల్ల ఇక్కడ లాభమెవరికి.? నష్టమెవరికి.? అనే దానిపై తెలుగుదేశం, వైసిపిల్లో అంతర్గత చర్చ సాగుతూనే ఉంది. ఓటింగు సరళిపై తర్జనభర్జన పడుతున్నారు. బిజెపి వల్ల ఎవరికో ఒకరికి నష్టం తప్పదనే విశ్లేషణలు లేకపోలేదు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేరుగా పొత్తు పెట్టుకుంది. ముందు జనసేనతోనే కలిసి ఎన్నికల్లో ఉండాలని భావించిన తెలుగుదేశం పార్టీ తర్వాత బిజెపి తోనూ కలిసి పోటీకి సిద్ధపడింది. జిల్లాలో పార్లమెంటుతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులే కూటమి తరపున పోటీ చేశారు. వైసిపి మాత్రం బిజెపితో అంతర్గత చెలిమితో ఎన్నికల్లో ఉంది. ఈ రెండు పార్టీలూ కేంద్రంలో బిజెపికి సహకారం అందించేందుకు సిద్ధంగానే ఉన్నాయి. గత ఐదేళ్ల నుంచే బిజెపికి అవసరమైనపుడల్లా వైసిపి పార్లమెంటులో సహకరిస్తోంది. పౌరసత్వ బిల్లుకూ మద్దతుగానే ఉంది. తెలుగుదేశం పార్టీ కూడా ఇదే వైఖరితో ఉంది. బిజెపితో కలిస్తే దేశంలో ప్రజల మధ్య జరిగే విభజన, మతవాదం వైపు నడక వంటి అంశాలను కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన ఇండియా వేదిక వెల్లడించింది. ఎన్నికల్లో కూటమి, వైసిపి అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా ఇండియా వేదిక తరుపున కాంగ్రెసు పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఓటింగు పరంగా ఎంత మేరకు సాధించారన్న దాని కన్నా బిజెపి విధానాలను ▶ 2లో

విహారయాత్రలో విషాదం

- బాపట్ల సమీపంలో నల్లమడ డ్రెయిన్‌లో నలుగురు గల్లంతు...
- తండ్రీకొడుకుల మృతదేహాలు లభ్యం
- మిగతా ఇద్దరి కోసం గాలింపు



రెండు మృతదేహాలూ లభ్యమైన ప్రాంతం





మృతిచెందిన సునీల్, అనురాజ్

ప్రజాశక్తి-బాపట్ల

విహార యాత్ర విషాదం నింపింది. బాపట్ల జిల్లా, బాపట్ల-పొన్నూరు రహదారి మార్గంలో అప్పికట్ల సమీపంలో నల్లమడ డ్రెయిన్‌లో స్నానాలకు దిగి.. హైదరాబాద్‌కు చెందిన నలుగురు గల్లంతయ్యారు. వీరిలో తండ్రీకొడుకులిద్దరు మృత్యువాత పడగా.. వారి మృతదేహాలు వెలికితీశారు. మరో ఇద్దరు గల్లంతవగా వారి కోసం అధికారులు తీవ్రంగా గాలిస్తున్నారు.

బాపట్లకు చెందిన దరబడి సునీల్ కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి హైదరాబాద్‌లో జగద్గిరిగుట్ట, బీరప్ప నగర్ ప్రాంతంలో స్థిర పడ్డాడు. సునీల్, మరో 12 మంది కలిసి బాపట్ల ప్రాంతంలో బంధువుల వద్దకు.. తర్వాత అక్కడి నుండి సూర్యలంకకు ప్రతి ఏడాది లాగే వెళదామని నిర్ణయించుకొని హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఈ నెల 27న పొన్నూరు మండలం వడ్డి ముక్కలకు చేరుకున్నారు. అక్కడినుండి 28న అదే మండలంలో మునిపల్లె గ్రామంలో బంధువుల వద్దకు చేరుకున్నారు. 29న మునిపల్లె నుండి పర్చూరు మండలం వీరన్నపాలెంకు బయలుదేరారు. వీరన్నపాలెం వెళ్లే క్రమంలో ప్రతి ఏడూ నల్లమడ డ్రెయిన్ వద్ద ఆగి పక్కనే ఉన్న పిటి ఛానల్ సాగునీటి కాలంలో స్నానాలు చేసి.. వెళ్లటం ఆనవాయితీగా ఉంది. అయితే ఈ ఏడు పిటి ఛానల్ పంట కాలువలో నీరు లేక పూర్తిగా ఎండిపోవడంతో పక్కనే ఉన్న నల్లమడ డ్రెయిన్‌లో స్నానాలకు దిగారు. అదే సమయంలో సముద్ర పోటునీరు అధిక ప్రవాహం వల్ల దిగిన వారు దిగినట్టే నీళ్లలో కొట్టుకుపోయారు. ముందుగా అనురాజ్ (సన్ని) (11) కాలువలోని నీటిలో కొట్టుకుపోవడంతో.. అతని తండ్రి దరబడి సునీల్‌కుమార్ (37) కూడా కొడుకును రక్షించే క్రమంలో నీళ్లలో కొట్టుకుపోయాడు. వీరిని రక్షించే క్రమంలో కిరణ్‌గౌడ్ (30), నందు (30) ▶ 2లో

మామిడి దిగుబడి అంతంత మాత్రమే..!

- అనుకూలించని వాతావరణం
- బంగినపల్లి కాయ టన్ను రూ.50 వేలు
- బెంగళూరు రకాలు రూ.25 వేలు
- సువర్ణ రేఖ రూ.40 వేలు
- ఇతర రాష్ట్రాలకు తరలింపు
- ఈ సంవత్సరం ఊపుగా లేని మార్కెట్



బాక్సులలో మామిడి కాయలు పెడుతున్న రైతులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మామిడికి వాతావరణం అనుకూలించ లేదు. ఈ సంవత్సరం వాతావరణం కారణంగా మామిడికాయల దిగుబడి తగ్గిపోయింది. మామిడి రైతు అనుకున్నస్థాయిలో కాయల దిగుబడి రాలేదు. మామిడి పరిస్థితి ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం అన్న రీతిలో ఉంది. శింగరాయకొండ, ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. కొంతమంది మామిడి రైతులు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటుంటే.. మరికొంతమంది మామిడి తోటలను కౌలుకు తీసుకున్న వారే అధికంగా ఈ ప్రాంతంలో ఉంటారు. ప్రస్తుతం మార్కెట్లో ఇతర రాష్ట్రాల వైపే ఎక్కువగా తరలిపోతున్నాయి. ఇక్కడ ఉన్న మార్కెట్ అంతంత మాత్రమే అయినప్పటికీ రైతులు కాయలను ఇతర రాష్ట్రాలకు పంపేందుకే మొగ్గు చూపుతున్నారు. మన రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం మార్కెట్లకు



లారీలలో ఇతర రాష్ట్రాలకు తరలుతున్న మామిడి

విపరీతంగా తీసుకువెళుతున్నారు. వీటితో పాటు ముంబై, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాలకు బంగినపల్లి కాయలను తీసుకోబోయే పనిలో ఉన్నారు. బంగినపల్లి మామిడికాయ టన్ను 50 వేల రూపాయలకు రైతులు వద్ద తీసుకొని లారీల్లో తరలించుకొని బాక్సులు పెట్టుకొని మరీ తీసుకువెళుతున్నారు. ఈ కాయలకు అధిక డిమాండ్ ఉంది. అయితే ఈ సంవత్సరం పూర్తి స్థాయిలో పంట లేకపోవడంతో ఉన్న కాయలను తరలించుకొని పోయే పనిలో వ్యాపారులున్నారు. అధికంగా పండే బెంగళూరు కాయలు కూడా జ్యూస్ ఫ్యాక్టరీకి అధికంగా తీసుకు వెళుతున్నారు. టన్ను 25 వేల రూపాయలు చొప్పున మంచి కాయలను తోటలకు వచ్చి కొనుగోలు చేసుకుని లారీల్లో తరలించుకొని పోతున్నారు. సువర్ణ రేఖ కాయలు టన్ను 40 వేల రూపాయల వరకు ఉంది. ఈ కాయల దిగుబడి కూడా అంతతో మాత్రంగానే ఉంది. నాటు కాయల ధర టన్ను 15 వేల నుంచి 20 వేల రూపాయల వరకు ఉంది. చెరుకు రసాలు టన్ను 35 వేల నుంచి 40 వేల రూపాయల వరకు కొనసాగుతూ ఉంది. ప్రధానంగా బంగినపల్లి మామిడి కాయలకి ఈ ప్రాంతంలో ప్రధానంగా డిమాండ్ ఉంది. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించపోవడం వల్ల బంగినపల్లి మామిడికాయలకు తోటలో ▶ 2లో



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాయంత్రం 5 లోపు ఓట్ల ఫలితాలు

డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌కి వివరించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఓట్ల లెక్కింపు ఫలితాలను జూన్ 4న సాయంత్రం 5 గంటల లోపు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. కౌంటింగ్ నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఢిల్లీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి.లతో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌కుమార్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్, జెసి ఆర్.గోపాలకష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇతర నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ వేస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం పార్లమెంట్ నియోజకవర్గానికి 40, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు చొప్పున టేబుల్స్ వేస్తున్నామని వివరించారు. తద్వారా సాయంత్రం 5 గంటల కల్లా ఫలితాలు వెల్లడించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్ర ప్రాంగణానికి మూడంచెల భద్రత కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజున హింసాత్మక ఘటనలపై నితీష్ కుమార్ ఆరా తీయగా, ఈవిఎంల డ్యామేజీకి కారణమైన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించామని ఎస్‌పి తెలిపారు. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్‌కు చేపడుతున్న ఏర్పాట్లపై డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌కు మార్కాపురం ఆర్‌ఒ రాహుల్ మీనా, ఒంగోలు ఆర్‌ఒ జివి సుబ్బారెడ్డి వివరించారు.

విహారయాత్రలో విషాదం!

(మొదటిపేజీ తరువాయి)

కూడా గల్లంతయ్యారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పడవల సహాయంతో నాగరాజు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. సునీల్‌కుమార్, అనురాజ్ మతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన నందు, కిరణ్‌ల కోసం బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, జిల్లా అగ్నిమాపక అధికారి సి.మాధవ నాయుడు, బాపట్ల అగ్నిమాపక అధికారి వై.వెంకటేశ్వర్లు, చీరాల సహాయ అగ్నిమాపక అధికారి రామకష్ణ, రెవెన్యూ అధికారులు నల్లమడ డ్రెయిన్ రోడ్డు, రైలు వంతెన వద్ద గజ ఈతగాళ్లను పెట్టుకుని గాలిస్తున్నారు.

బాపట్ల-గుంటూరు ప్రధాన రహదారి మార్గంలో ఉన్న ఈ నల్లమడ డ్రెయిన్ ఒక్కొక్కసారి ఉధృతంగా ప్రవహిస్తుంది. కాలువ అంచుకు వెళ్లి కాలుజారి గల్లంతైన ఘటనలు కూడా గతంలో జరిగాయి. ఇక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడమే ప్రమాదాలకు కారణమని స్థానికులు చెబుతున్నారు.

బిజెపితో నష్టమెవరికి.?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో ఎండగట్టారు. ముస్లిం రిజర్వేషన్లపైనా ప్రధాని మోడీ మాట్లాడారు. ముస్లిం మైనార్టీలు, క్రిస్టియన్లలో బిజెపి విధానాలపై ఆందోళన రేగింది. ఓటింగులో దీని ప్రభావం ఉంటుందని భావించారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంత లాభం ఎంత నష్టం జరిగిందనే దానిపైనా ఇంకా చర్చలు అంచనాలు వేస్తూనే ఉన్నారు. వైసిపి అభ్యర్థులు ముస్లిం, క్రిష్టియన్ ఓట్లు తమకే ఎక్కువశాతం పడ్డాయని భావిస్తున్నారు. గెలుపు కోసం వేసుకునే మెజార్టీల్లో ముస్లిం, క్రిష్టియన్ ప్రాంతాల్లో తమకే ఎక్కువగా మెజార్టీలు వేసుకుంటున్నారు. ఇదే భావనతో ఒంగోలులోని ఇస్లాంపేట వార్డుల్లో ఎక్కువశాతం మెజార్టీలను వేసుకున్నారు. జిల్లాలో ముస్లిములు ఎక్కువగా ఉన్న పట్టణాలు, ప్రాంతాల్లో తమకు అనుకూలంగా ఉందని అంచనాలో ఉన్నారు. వాస్తవంగా ముస్లిం, క్రిష్టియన్ ఓట్లు మెజార్టీ వైసిపికే పడ్డట్లు సమాచారం. ఎందుకంటే వీరిపై దేశవ్యాప్త అంశాల ప్రభావం భారీగా ఉండకపోవచ్చు. ఎంతోకొంత మాత్రం ఉందని చెబుతున్నారు. పైగా కొనుగోళ్లు, స్థానికంగా ప్రలోభాలు కూడా ప్రభావితం చేసి ఉండొచ్చు. తెలుగుదేశం పార్టీకి గతంలోనూ ఈ వర్గాల నుంచి పెద్దగా ఓట్లు లేవనే చెప్పాలి. ఇప్పుడు కొత్తగా పెరిగిందీ లేదు. స్థానికంగా ముస్లిములలో కొందరు నేతలు తెలుగుదేశంలోనూ ఉన్నారు. వారికి అభ్యర్థులతో ఉన్న సంబంధాలతో కొంతశాతం తెలుగుదేశం అభ్యర్థులకూ వేయించారు. బిజెపితో నేరుగా ఉన్న పొత్తు వల్ల నష్టం తప్పలేదు. ఇండియా వేదిక తరుపున పోటీచేసిన కాంగ్రెసుపార్టీకి అభ్యర్థులకు ముస్లిం, క్రిస్టియన్ ఓట్లు స్వల్పంగానైనా మళ్లాయని భావిస్తున్నారు. ప్రధానంగా పార్లమెంటు అభ్యర్థికి పడ్డట్లు అంచనా. నేరుగా బిజెపికి దెబ్బ కనిపించాలంటే కాంగ్రెసుకే వేయాలని కొన్ని చోట్ల నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ ఓటు తమకు ఇష్టమైన వారికి వేశాక పార్లమెంటు ఓటు కాంగ్రెసుకు పడ్డట్లు భావిస్తున్నారు. ఈ చీలిక వల్ల ఎవరికి నష్టం అనే దానిపైనా చర్చ సాగుతోంది. ఎంత శాతం మళ్లిందో అంత వైసిపికే గండిపడే అవకాశాలున్నాయని అంచనా. జిల్లాలో ఒంగోలు, పొదిలి, కంభం, గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం, కనిగిరి తదితర పట్టణాల్లో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. క్రిస్టియన్లు అన్ని పట్టణాల్లో ఉన్నారు. అయితే క్రిష్టియన్లు ఇక్కడ ఎస్సీల్లోనే ఉన్నారు. వీరిలో మెజార్టీ వైసిపికే పడ్డాయని భావించినా.. ఎస్సీ రిజర్వేషన్ వల్ల వీరిలో ఓ సామాజికవర్గం తెలుగుదేశం వైపు మొగ్గు చూపింది. వీరి ఓట్లపై పార్టీలకూ స్పష్టత ఉంది. ఏదేమైనా బిజెపి ప్రభావంతో ఇండియా వేదికకు పడ్డ ఓట్లు ఏ పార్టీకి ఎంత లాభం.. ఎంత నష్టం చేశాయనేది ఫలితాల రోజున వెల్లడి కానుంది.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.321

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి బుధవారం కందులూరు గ్రామ రైతులు 1,348 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 1,242 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 106 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర 321 రూపాయలు కాగా అత్యల్ప ధర రూ.205 పలికింది. సరాసరి కిలో ధర రూ.270.74 పలికింది. వేలంలో 31 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

మున్సిపల్ కార్మికుల హెల్త్ అలవెన్స్..

బకాయిలు వెంటనే చెల్లించాలి: సిఐటియు

ప్రజాశక్తి-పొదిలి

మున్సిపల్ కార్మికుల హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం పొదిలి ఎన్‌జిఓ హోమ్‌లో సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగిన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రకాశం జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రమేష్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ కార్మికులకు 1 నెల నుంచి 6 నెలల బకాయిలు ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటికీ నేటికి జీఓలు విడుదల చేయలేదన్నారు. జీఓలు ఇచ్చిన సమ్మె కాలపు వేతనాలు, పండుగ అలవెన్స్ 5 నెలలు పూర్తవుతున్నా నేటికీ అందలేదన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో వారిపై పనిభారం పెరిగిందన్నారు. మున్సిపల్ కార్మికుల ఒప్పందం మేరకు జీఓలు విడుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, అప్పటిదాకా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు ఎం రమేష్

ఇవ్వాలని అన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను సచివాలయాలకు కేటాయించటం ఆపకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా నాయకులు ఐ నాగయ్య, ప్రసాద్, కుమారి, పద్మ, కెవి నరసింహం, రాములు, లక్ష్మయ్య, బాబు పాల్గొన్నారు.


పాదయాత్ర చేస్తున్న అభిమానులు

శ్రీశైలానికి పాదయాత్ర

ప్రజాశక్తి-పుల్లలచెరువు

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తాటిపర్తి చంద్రశేఖర్ అత్యధిక మెజారిటీతో గెలవాలని పుల్లలచెరువు సోషల్ మీడియా టీం సభ్యులు బుధవారం పుల్లలచెరువు నుంచి శ్రీశైలం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి ఉడుముల అరుణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కందుల వెంకటయ్య, వైసీపీ నాయకులు కొర్లకుంట జానకి రఘు, సచివాలయాల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు, యల్లారెడ్డి రోశిరెడ్డి, కుడుముల కాశయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ అన్నారు. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా బుధవారం యర్రగొండపాలెంలోని శాఖా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. జాతీయ నాయకుల జీవిత చరిత్రలను వివరించారు. వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం పలు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. జూన్ 7వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపుతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథపాలకురాలు

ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి మండలాల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఏపీఓలు ఈసీలు టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాలేటి వెంకటస్వామి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డ్వామా పీడీ డాక్టర్ బి అర్జునరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో డాక్టర్ అర్జునరావు మాట్లాడుతూ మండలాలలో ఇచ్చిన టార్గెట్ ప్రకారం కూలీలను పెంచాలని, పనికి వచ్చిన ప్రతి ఒక్కరికీ రోజుకు రూ.300/- తగ్గకుండా వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పని ప్రదేశంలో నీడ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మెడికల్ కిట్స్ సిద్ధంగా ఉంచుకోవాలని, అలాగే చెరువులు, కుంటలు కాకుండా రైతులకు ఉపయోగపడే ఫామ్ పాండ్స్‌ను రైతులతో మాట్లాడి ప్రతిపాదనలు జిల్లా కార్యాలయానికి పంపిస్తే మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే రైతులకు సంబంధించి హార్టికల్చర్ కింద పండ్ల తోటలు కూడా ఎన్ఆర్ఈజీఎస్ కింద ఇస్తామని తెలిపారు. అలాగే అమృత సరోవర్ ట్యాంక్ లాంటి రైతులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రతి సబ్జెక్టుపైనా గ్రామాల వారీగా రివ్యూ చేశారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓలు వాసంతి, వర్మ, రాఘవ పాల్గొన్నారు.


లాడ్జీలను తనిఖీ చేస్తున్న పోలీసులు

లాడ్జీలలో తనిఖీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని పలు లాడ్జీలను బుధవారం ఎస్ఐ సుదర్శన్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా రిసెప్షన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. లాడ్జీలోని రూములలో ఉన్న అపరిచిత వ్యక్తులను ఆయన ప్రశ్నించి వారి ఐడీ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుదర్శన్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం అందజేయాలన్నారు.

మామిడి దిగుబడి అంతంత మాత్రమే..

(మొదటిపేజీ తరువాయి)

దిగుబడి తక్కువగానే కనిపిస్తోంది. బంగినపల్లి మామిడి కాయలకి టన్ను 50 వేల రూపాయలు వరకు ధర పలుకుతోంది. వ్యాపారులు నేరుగా తోటలకు వచ్చి కాయలు సైజును బట్టి తీసుకోబోయే పనిలో ఉన్నారు. ఇక జ్యూస్ ఫ్యాక్టరీకి సంబంధించి బెంగళూరు కాయలకు డిమాండ్ విపరీతంగా ఉంది. కాయను బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం 25 వేల రూపాయల వరకు మార్కెట్ సాగుతోంది. పూర్తిస్థాయిలో మామిడికాయలు లేకపోవడం వల్ల ధరలు కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. బంగినపల్లి మామిడికాయలు బాక్సులో పెట్టి మరీ ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలిస్తున్నారు. జ్యూస్ ఫ్యాక్టరీలకు సంబంధించిన కాయలు లారీల్లో నేరుగా పోసి బెంగళూరు మామిడికాయలను పంపిస్తున్నారు. 70 వేల పైగా ఉన్న టన్ను బంగినపల్లి మామిడికాయ కరోనా తరువాత కూడా మార్కెట్లో ఎలాంటి ఊపు కనిపించలేదు. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల కాయల దిగుబడి పూర్తిస్థాయిలో లేనందువల్ల ధరలను నిర్ణయించే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. ఈ సంవత్సరం మామిడికాయల పరిస్థితి చెట్టు ఉన్నా కాయ లేదు అనే విధంగా తయారయిందని రైతులంటున్నారు.

ప్రజాశక్తి 3
గురువారం 30 మే 2024

వరుస ఘటనలతో...

శింగరాయకొండలో టెన్షన్.. టెన్షన్..

- పోలీసుల తీరుపట్ల పెద్దఎత్తున చర్చ
- ఎన్నికల తర్వాత అలర్లు, దాడులు
- ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి-శింగరాయకొండ

సార్వత్రిక ఎన్నికలకు ముందు శింగరాయకొండలో వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఎన్నికలు అయిన తర్వాత టెన్షన్, టెన్షన్‌గా ఉంది. ఏరోజు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అందుకు వరుసగా జరుగుతున్న ఘటనలే కారణం... పాత కక్షలను మనసులో పెట్టుకొని కొందరు, వైసిపి నాయకులు అండదండలు చూసుకొని మరికొందరు. పోలీసుల నిర్లక్ష్య వైఖరిని ఆసరా చేసుకొని కొందరు రెచ్చిపోతున్నారు. అల్లర్లు, దాడులకు పాల్పడుతున్నారు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


దగ్ధమైన బైకు (ఫైల్)

ఎన్నికల పూర్తయిన మరుసటి రోజు మే 14న శింగరాయకొండ మండలం సోమరాజు పల్లి పంచాయతీకి చెందిన వెంకటేష్‌కు సంబంధించిన పల్సర్ బైకు ఇంటి ముందు ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పుటించారు. దీంతో బైకు కాలి బూడిదైంది.పోలీసులు ఆ విషయం బయటకు పొక్కకుండా కేసు నమోదు చేసి వదిలేశారు. మరుసటి రోజు అదే ప్రాంతంలో మరో బైకును దగ్ధం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదు. ఈ రెండు ఘటనలతో తీవ్ర అలజడి రేగింది.


ఆత్మహత్య చేసుకున్న సుధాకర్ (ఫైల్)

తర్వాత మూలగుంటపాడు వెంకటేశ్వరకాలనీలో చొప్పర శివ శంకర్ ఆస్తి కోసం తమ సొంత అన్నయ్యను రాళ్లతో కొట్టి హత్య చేశాడు. అన్నదమ్ముల ఆస్తి గొడవపై రెండేళ్లుగా పోలీసు స్టేషన్‌లో పంచాయితీలు నడుస్తున్నాయి. పోలీసులు వారి మధ్య రాజీ కుదిర్చి ఉంటే ఈ హత్య జరిగేది కాదని తెలుస్తోంది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే మూలగుంటపాడుకు చెందిన టిడిపి నాయకుడు చిగురుపాటి శేషగిరిరావు కారుపై పెట్రోలు పోసి నిప్పుటించారు. దీంతో కాలిబూడిదైంది. వైసిపి చెందిన ఓ వ్యక్తి వ్యక్తిగత గొడవల నేపథ్యంలో కిరాయి మనుషుల చేత కారుపై పెట్రోలు పోయించి నిప్పు పెట్టించాడు. ఇది జరిగిన 24 గంటల్లోనే బింగినపల్లి గ్రామపంచాయతీ పెద్దనపాలెంకు చెందిన కోమట్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కొందరు దాడి చేశాడు. దీతో సుధాకర్ అవమానం తాళలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గత రెండునెల క్రితం పెద్దనపాలెంకు చెందిన ఓ ప్రేమ జంట వ్యవహారంలో పోలీసు స్టేషన్‌కు వచ్చింది.


దగ్ధమైన కారు (ఫైల్)

అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా సంబంధిత వ్యక్తులను హెచ్చరించి వదిలేశారు. కేసులను నమోదు చేసి ఉంటే సుధాకర్ ఆత్మహత్యకు దారితీసేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలీసులు రాత్రి పూట గస్తీ నిర్వహించడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని ఆక తాయులు పెట్రేగిపోతున్నారు. ఇది ఇలా ఉంటే శానంపూడికి చెందిన ఓ దళిత కుటుంబం మామిడి తోటలో ఏర్పాటు చేసుకున్న పూరి గుడిసెపై పెట్రోలు పోసి తగులబెట్టారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదు. తమపై ఎక్కడ దాడి జరుగుతుందోని బాధితులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని పొలా ల్లోనే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. పోలీసుల ఉదాసీనత వల్లే ఇలా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

పెట్రో బాంబు దాడి కేసులో ఒకరు అరెస్టు

- మరొకరు పరారీ
- పాత గొడవల కారణంగా హత్యాయత్నం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి -కనిగిరి

పెట్రో బాంబు కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేయగా, మరో వ్యక్తి పరారీ అయినట్లు కనిగిరి డిఎస్‌పి రామరాజు తెలిపారు. తన కార్యాలయం బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. వెలిగండ్ల మండలం పందువ పంచాయతీ పరిధిలోని జంగం నర్సాయపల్లిలో మంగళవారం తెల్లవారు జామున ఉపాధ్యాయుడు తీట్ల నారాయణపై హత్యాయత్నం పాత కక్షల నేపథ్యంలోనే జరిగినట్లు తెలిపారు. రాజకీయాలకు సంబంధం లేదని తెలిపారు. ఉపాధ్యాయుడు తీట్ల నారాయణకు అదే గ్రామానికి చెందిన వాలంటీరుగా పనిచేసి రాజీనామా చేసిన కటుకూరి అనంతబాల అలియాస్ దూదేకుల రజాక్, కటుకూరి రహీంకు గత నాలుగేళ్ల క్రితం కోవిడ్ సమయంలో గొడవలు జరిగినట్లు తెలిపారు. అప్పటి నుంచి వారి మధ్య విభేదాలు ఉన్నట్లు తెలిపారు. అనంత బాల తమ బంధువైన కటుకూరి రహీంతో కలిసి ఉపాధ్యాయుడిని హత్యచేసేందుకు పథకం రచించినట్లు తెలిపారు. అందులో భాగంగా నిద్రిస్తున్న ఉపాధ్యాయుడు నారాయణ కుటుంబ సభ్యులపై బీరుబాటిల్లో పెట్రోలు నింపి నిప్పు పెట్టి విసరినట్లు తెలిపారు. అవి చెట్టుకు తగిలి పేలడంలో మంటలు చెలరేగినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఉపాధ్యాయుడు నారాయణ వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు బాధితుడికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకొనేందుకు మూడు పోలీసులు బందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితుడు కటుకూరి అనంతబాలను పందువ నాగులవరం జంక్షన్ వద్ద పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు కటుకూరి రహీం పరారీలో ఉన్నట్లు తెలిపారు. రహీంను కూడా త్వరలో పట్టుకుంటామని డిఎస్‌పి తెలిపారు. కేసును త్వరితగతన చేధించిన డిఎస్‌పి రామరాజు, పామూరు సిఐ రామనాయక్ ,వెలిగండ్ల ఎస్ఐ శివ, సిఎస్‌పురం ఎస్ఐ ప్రేమ్ కుమార్ ,పామూరు ఎస్ఐ సైదుబాబు , కానిస్టేబుల్ సాలికినను ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ అభినందించారు.

భూసార పరీక్షలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-దర్శి

రైతులు భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని తాళ్లూరు మండలం లక్కవరం గ్రామ వ్యవసాయ సహాయకులు కె. వీరాంజనేయులు తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్‌సి రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమంబుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో- ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా నేల స్వభావం తెలుస్తుందన్నారు. అంతే కాక భూమి ఏ పంటలకు అనుకూలమో తెలుసుకొని ఆ పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. అనంతరం రైతుల పొలాలలో మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం దర్శి కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు పంపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రంథాయంలో తనిఖీ

ప్రజాశక్తి-దర్శి

వార్షిక తనిఖిలో భాగంగా దర్శి శాఖా గ్రంథాలయాన్ని ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. సమ్మర్ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులతో మాట్లాడారు. సమ్మర్ క్యాంప్‌లో నేర్చుకున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను ఉపయోగించుకుని తమలోని టాలెంట్‌ను నిరూపించుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో కోటయ్య, చెంచు లింగం, గ్రంథపాలకురాలు విజయ కుమారి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మద్యం అక్రమంగా తరలిస్తున్న ఓవ్యక్తిని సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లు, ఓ బైకును స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారుల కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన గణేష్ అనే వ్యక్తి బుధవారం మద్యం బాటిళ్ల తరలిస్తున్నాడు. అందిన సమాచారం మేరకు సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లు, బైకును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సెబ్ సిఐ కొండారెడ్డి, సిబ్బందిమాధవరావు,రిజ్వాను పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బస్సు ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కారును ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భట్టిప్రోలు, పెనుమూడి గ్రామాల మధ్య 216 జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... రేపల్లె డిపోకు చెందిన ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్ బస్సు గుంటూరు నుంచి పెట్టేరు మీదుగా రేపల్లె వెళ్లేందుకు జాతీయ రహదారి నుంచి పేటేరు వైపు తిరిగింది. అదే సమయంలో బస్సు వెనుకనే వస్తున్న కారు కూడా పేట్టేరు వైపు తిరిగింది. ఈ క్రమంలో బస్సు కారును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్ తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కొల్లూరు

మట్టిలోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత స్తంభం విరిగి ట్రాక్టర్ ట్రక్కుపై పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కొల్లూరు వద్ద ముస్లిం స్మశాన వాటిక సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రమాదం తప్పింది. విరిగిపోయిన స్తంభాన్ని తొలగించి దానిస్థానంలో నూతన స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునర్ధురించినట్లు విద్యుత్ ఎఇ తెలిపాడు.

అదుపుతప్పి ఆటో బోల్తా 14 మందికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

పందిని తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టిన ఘటన 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పెదకండ్లగుంట గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కొండపి మండలం అనకర్లపూడి ఎస్‌సికాలనికి చెందిన కూలీలు జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామంలో మిరపకాయలు కోతకు వెళ్తున్నారు. ఘటన స్థలం వద్ద వచ్చేసరికి పంది ఆటోకు అడ్డుగా వచ్చింది. పందిని తప్పించే క్రమంలో అదుపు తప్పి ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటో ప్రయాణిస్తున్న 14 మంది కూలీలకు గాయాలయ్యాయి. పెదకండ్లగుంట గ్రామస్తులు స్పందించి ఆటోలోని కూలీలకు బయటకు తీశారు. అనంతరం క్షతగాత్రులను మరో ఆటోలో కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే స్వామి పరామర్శ

ఆటో ప్రమాదంలో గాయపడి కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జి.రామయ్యచౌదరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమండల సమావేశంలో ఎంపిపి అవిశన జ్యోతి

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఎంపిపి అవిశన జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అన్ని గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా పిడబ్లయూ శాఖ, సంబందించిన అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామి పనుల్లో కూలీలకు పని కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ఆయా శాఖల అధికారులు తమ శాఖల పనితీరును మాత్రమే వివరించారు. ఎంఇఒ గంగాధర్ మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు ప్రారంభం అవుతాయని చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యా కానుక కిట్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తల్లి, దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. 2023-24 విద్యా సంవత్సరంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10తరగతి చదివిన విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఫ్యాకల్టీగా సాయి పబ్లిక్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం ప్రిన్సిపాల్ వీర్రాజు, డ్రాయింగ్ మాస్టర్ విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో మంద జోసఫ్, రిటైర్డు బ్యాంకు ఉద్యోగి తాళ్లూరి బాబురావు విద్యార్థులకు బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న డీన్ వి శ్రీనివాసరావు

వ్యవసాయ కళాశాల దినోత్సవం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల వ్యవసాయ కళాశాల 79వ కళాశాల వసతి గృహ దినోత్సవాన్ని ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దినోత్సవ సభకు విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆర్ శారదా జయ లక్ష్మి, విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ జివిస్జి అయ్యంగార్ హాజరవుతారని తెలిపారు. రెండు రోజులు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. సమావేశంలో ఎం రమాదేవి,

ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి

◆ కనీస కూలి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ ◆ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్

ప్రజాశక్తి - చీరాల



ఉపాధి కూలీలతో మాట్లాడాతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి కృష్ణమోహన్

మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ బుధవారం కలిసి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీల పోరాటాలతోనే ఉపాధి హామీ పథకం వచ్చిందని అన్నారు. ఈ పథకం గ్రామాల్లో వ్యవసాయ కూలీల కుటుంబాల్లో వెలుగులు తెచ్చిందని అన్నారు. గ్రామాల్లో వలసలు అగాయాని అన్నారు. కూలీలు ధైర్యంగా బ్రతుకుతున్నారని అన్నారు. ఇటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేసేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకే ఈ పథకానికి నిధులు కోత విధించారని అన్నారు. గత ఏడాది రూ.90వేల కోట్లు ఈ పథకానికి కేటాయిస్తే ప్రస్తుతం రూ.60వేల కోట్లకు కుదించారని అన్నారు. గతంలో మేట్‌లకు ఇచ్చిన ప్రోత్సాహం ఇప్పుడు ఇవ్వడం లేదని అన్నారు. పార, గునపం, తట్టలకు గతంలో డబ్బులు ఇచ్చారని ప్రస్తుతం వాటిని ఎత్తేశారని చెప్పారు. గతంలో పనిప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం కోసం ప్రాథమిక మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ సమకూర్చే వాళ్లని ప్రస్తుతం వీటన్నింటినీ తొలగించారని చెప్పారు. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరిగి ఉపాధి తగ్గిపోతుందని చెప్పారు. కరోనా తర్వాత కూలీలు వలసలు వెళ్ళడానికి కూడా భయపడే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని కోరారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని డిమాండ్ చేశారు. తాము ఉచితంగా డబ్బు అడగడం లేదని, పని కల్పించమని అడిగేందుకు అవకాశంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలు ఐక్యం కావాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘంలో చేరాలని సూచించారు. పథకాన్ని రక్షించుకునేందుకు పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రసాదు, మోజేష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ప్రధాన వీధులు

ప్రజాశక్తి - నిజాంపట్నం



వడగాలితో నిర్మానుష్యంగా బస్టాండ్ సెంటర్

మండలంలో గత రెండు రోజుల నుంచి వడగాలి విపరీతంగా వీస్తోంది. దీంతో బస్టాండు సెంటర్లో మధ్యాహ్న సమయంలో జన సంచారం లేక నిర్మానుష్యంగా బోసిపోయి కనిపించింది. ఈనెల 25నుండి రోహిణి కార్తె మొదలు కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. వడగాలి వల్ల ప్రజలు ఒక్కపోతకు గురవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణీలు వడగాలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. భానుడి భగభగలు జనాన్ని తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నాయి. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు చెరుగు తుండటంతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. వాహన దారులు, జన సంచారం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం 5 దాటినా వేడిగాలి తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో ఆపసోపాలు పడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉపాధి కూలీలు వేకువ జామున పనులకు వెళ్లి త్వరగా పనులు ముగించుకుని ఇంటికి చేరుకుంటున్నారు. ఎండ ధాటికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు అల్లాడిపోతున్నారు. వడగాలికి తీవ్రంగా చెమటలు పట్టడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక ఇళ్ళల్లో ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, గొడుగు, ముఖానికి మాస్క్ ధరించి వెళ్లాలని చెబుతున్నారు. భానుడి ప్రతాపం రోజు రోజుకు ఎక్కువ కావడంతో జనం ఇంటికే పరిమితం అవుతున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్, మెయిన్ బజార్లలో జన సంచారం లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు ప్రజలు, పాదచారులు, వాహనదారులు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు.

అల్లాబక్షి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - బాపట్ల



మాట్లాడుతున్న జాగర్లమూడి లక్ష్మి

జర్నలిస్టు, రచయిత అల్లాబక్షీ మరణం పత్రికా, సాహిత్య రంగాలకు తీరనిలోటని విశ్రాంత గృహ విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి అన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో సీనియర్ జర్నలిస్టు బాషా అధ్యక్షత జరిగిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా అల్లాబక్షి విశేషంగా రాణించారని అన్నారు. సాహిత్యానికి బక్షి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఆనంద్ బక్షి అనే కలం పేరుతో అల్లాబక్షి అనేక రచనలు చేశారని అన్నారు. ఈ సందర్భంగా అల్లాబక్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. సభలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బిఎస్ నారాయణ భట్టు, ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షులు పిసి సాయిబాబు, హైకోర్టు న్యాయవాది కామేపల్లి కృషి బాబు, గిరిజారాణి, న్యాయవాది జమ్రుద్ బాషా, రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు తిమ్మన శ్యాంసుందర్, రచయిత ఆర్ఎన్ వర్మ, ఆదం షఫీ, షేక్ జిలాని, రహీమ్ జానీ, కమల్ భాష, అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, మహమ్మద్ ఖాన్, సయ్యద్ పీర్, బండికళ్ళ బాబురావు, దేవరకొండ రాము, పాత్రికేయులు చాన్ బాషా, మహబూబ్ సుభాని, బడుగు కృష్ణ, మేధా శ్రీనివాసరావు, వేజెండ్ల శ్రీనివాసరావు, బక్కా దీపక్, రచయితలు మస్తాన్ వలీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ పడవల కిషోర్

మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ బుధవారం నిర్వహించారు. శిక్షణకు ట్రైనర్లుగా పడవల కిషోర్, వి సురేష్ వ్యవహరించారు. తాజ్ హొటల్ వాళ్ళు వంటలపై చేసిన పిపిటిని శిక్షణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నీలం దేవరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన వంటలు వండి వడ్డించాలని సూచించారు. డిప్యూటీ డిఇఓ జి వెంకటేశ్వరరావు, ఎఎంఓ పి శ్రీనివాసరావులు శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో 40 మంది మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

31న యుటిఎఫ్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

యుటిఎఫ్ కార్యాలయం ఈనెల 31న ప్రారంభిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ దాచురి రామారెడ్డి కలని నెరవేరిందని అన్నారు. ఎస్ఎ సత్తార్, సిఎస్ శర్మ, పి లూకయ్య వంటి యుటిఎఫ్ నాయకులు వేసిన బాటను ఆదర్శంగా తీసుకొని పనిచేస్తున్నట్లు తెలిపారు. 2021లో కె వీరాంజనేయులు దంపతుల చేతుల మీదుగా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు 475 మందికి కిపైగా అందించి రూ.70 లక్షలతో భవనం నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. అదే రోజు ఎస్ఎఆర్ఆర్ఎం హై స్కూల్ హెచ్ఎం కొమ్మూరి వీరాంజనేయులు పదవి విరమణ సభ నూతన భవనంలో జరుగుతుందని తెలిపారు. ఎంఎల్‌సిలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వర రావు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, భవన ప్రారంభకులుగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు గవిని నాగేశ్వరరావు, కె వీరాంజనేయులు, బి బిక్షాలు బాబు, జి సూరిబాబు, పి సురేష్, పి సీతారామరాజు, సిహెచ్ వెలుగొండారెడ్డి, ఎం శ్రీనివాసులు, టి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
గురువారం 30 మే 2024

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

- 18వేల మెజార్టీ వస్తుందని చెబుతున్న టిడిపి నాయకులు
- వైసిపి లెక్కలో 3500 మెజార్టీ
- పందాలకు సై అంటున్న టిడిపి శ్రేణులు
- ఆచితూచి అడుగులేస్తున్న వైసిపి శ్రేణులు


ఎమ్మెల్యే స్వామి మంత్రి సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

సార్వత్రికలు పూర్తయిన తర్వాత టిడిపి, వైసిపి నాయకులు మెజార్టీపై లెక్కలు వేశారు. ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొండపి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి టిడిపి అభ్యర్థిగా బరిలో దిగారు. వైసిపి అభ్యర్థిగా మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను రంగంలోకి దింపారు. ఈ నియోజకవర్గ పరిధిలో కొండపి, జరుగుమల్లి, టంగుటూరు, శింగరాయకొండ, పొన్నలూరు, మర్రిపూడి మండలాలు ఉన్నాయి. ఎన్నికలు పూర్తయిన తర్వాత డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, డాక్టర్ ఆదిమూలపు సురేష్ లు ఏజెంట్లు ద్వారా పోలైన ఓట్లు వివరాలను గ్రామాల వారీగా తెప్పించుకున్నారు. టిడిపి నాయకులు లెక్కలు వేసి 18 వేల ఓట్ల మెజారిటీతో డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గెలుపొందుతారని చెప్పారు. మహిళల ఓట్లు అధికంగా పోలయ్యాయని ఆ ఓట్లు తమకే పడతాయని లెక్కలు వేసుకొని గ్రామాల వారీగా నియోజకవర్గంలో లెక్కలు వేసి 3500 ఓట్ల మెజారిటీతో డాక్టర్ ఆదిమూలపు సురేష్ విజయం సాధిస్తారని చెబుతున్నారు. మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎన్నికల తర్వాత అనారోగ్య సమస్యల కారణం హైదరాబాదులోని హాస్పిటల్‌కు వెళ్లారు. బుధవారం శింగరాయకొండ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. మండలాల వారీగా ఎన్నికల కౌంటింగ్‌కు వెళ్లి ఏజెంట్లతో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గ్రామాల వారీగా సమీక్ష చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే టిడిపి, వైసిపి నాయకులు గెలుపుపై బెట్టింగులు కాస్తున్నారు. టిడిపి నాయకులు గ్రామాలు, మండలాలు, నియోజకవర్గంలో వచ్చే మెజార్టీపై పందేలు కాస్తున్నారు. వైసిపి నాయకులు ముందు పందాలకు సై అని చెప్పి తర్వాత వెనకడుగు వేశారు. టిడిపి నాయకులు శింగరాయకొండ మండలంలో ఒక్క ఓటైనా తమకు మెజార్టీ వస్తుందని రూ.50 లక్షలకుపైగా పందాలు కాసినట్లు తెలుస్తుంది. వైసిపి నాయకులు పందెం కాసేందుకు ముందుకు రావడం లేదు. గ్రామాల వారీగా, పోలింగ్ కేంద్రాల వారీగా పందాలకు రావాలని టిడిపి నాయకులు రెచ్చగొడుతున్నప్పటికీ వైసిపి నాయకులు ముందుకు రావడం లేదు.

కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన

ప్రజాశక్తి -కనిగిరి



మాట్లాడుతున్న ఎస్‌పి గరుడ సుమిత్ సునీల్

ప్రశాంత వాతావరణం నడుమ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేసుకుందామని ప్రకాశం జిల్లా ఎస్‌పి గరుడ సుమిత్ సునీల్ తెలిపారు. కనిగిరి పట్టణంలోని పవిత్ర కల్యాణ మండపంలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగింపు దశలో ఉందన్నారు. కౌంటింగ్ అనంతరం ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అధికారులకు సహకరించాలని సూచించారు. కౌంటింగ్ అనంతరం బాణాసంచా పేల్చడం, ర్యాలీలు, సభలు, ఊరేగింపులు నిర్వహించ కోవాలంటే తప్పనిసరిగా రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలలో గెలుపు,ఓటములు సహజమని వాటిని ఆసరాగ చేసుకుని ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రామరాజు, ఆర్‌డిఒ పాలపర్తి జాన్ ఇర్విన్, కనిగిరి ,పామూరు సిఐలు వెంకటేశ్వరరావు, రామనాయక్, కనిగిరి డివిజన్ పరిధిలోని ఎస్ఐలు త్యాగరాజు, శివనాగరాజు, రమేష్ బాబు, శివ, ప్రేమ్ కుమార్ ,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి -కనిగిరి


వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిలో నీటిసమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. నాగుల చెరువులోకి నీరు చేరకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్‌డిఒకు జాన్ ఇర్విన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి పట్టణ ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. పట్టణానికి ప్రధాన నీటి వనరులుగా ఉన్న నాగుల చెరువులోకి నీరు చేరకుండా క్వారీయజమానులు, గ్రానైట్ కంపెనీలు, రియల్ వ్యాపారులు అడ్డుకున్నట్లు తెలిపారు. కొండవాగు నీటిరు నాగుల చెరువులోకి చేరకుండా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. దీంతో నాగుల చెరువులోనికి నీరు రావడం లేదన్నారు. పట్టణంలోని భూగర్భ జలాలు ఎండి పోతున్నట్లు తెలిపారు. వర్షాలు పడినప్పుడు నీరు చెరువులోకి చేరితేనే పట్టణంలోని బోర్లలో బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటుందన్నారు. నాగుల చెరువులోకి నీరు చేరకుండా అడ్డుకుంటున్న క్వారీ యజమానులు, గ్రానైట్ కంపెనీలు, రియల్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో దేవకి వెంకటేశ్వర్లు, బసిరెడ్డి, పిచ్చిరెడ్డి, బాలయ్య బొట్టు శ్రీనివాసులు, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పాత బకాయిలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి.మస్తాన్

ప్రజాశక్తి-కొండపి


కూలీలతో మాట్లాడుతున్న కెజి.మస్తాన్

ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించి, పాత బకాయిల వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి.మస్తాన్ డిమాండ్ చేశారు. కొండపి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కెజి.మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో క్రమంగా నిధులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఫొటో హాజరు పద్ధతిని రద్దు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో కూలీలకు మజ్జిగ, సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. షే ష్రిప్పులు, పార, తట్ట ,పలుగు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు వై. నారాయణ, ఎ.సుజాత ,విజయమ్మ, దేవి, కొండమ్మ, రోశయ్య పాల్గొన్నారు. హనుమంతునిపాడు : ఉపాధి కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన కూలి కూడా రావడం లేదని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని గాయంవారిపల్లెలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లు ఉపాధి కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన రోజు వారీ కూలి రూ.300 కూడా రావడం లేదన్నారు. గతేడాది రోజు వారీ కూలి రూ.273 ప్రకటించినట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి నుంచి ఢిల్లీలో వరకూ ఉపాధి కూలీలకు రోజువారీ కనీస వేతనం కూ. 600 పెంచాలని ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. దీంతో రూ.27 పెంచి రోజు కూలీ రూ.300గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆయిల్ ధరలు, రవాణా ఛార్జీలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రూ.300 కూలి ఏమూలకు సరిపోవడం లేదన్నారు. ఉపాధి కూలీలు పని కోసం మండుటెండల్లో మూడు, నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ వారి కనీస వేతనం రూ.300 కూడా రావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీలకు కనీసం వేతనం రూ.300 వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బైపిసి గ్రూపు ప్రారంభం

ప్రజాశక్తి-పిసిపల్లి

పిసిపల్లి కెజిబివిలో ఈ విద్యాసంవత్సరం నుంచి బైపిసి గ్రూపును ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ బి.సుజాత తెలిపారు. 10వ తరగతి పాసైన బాలికలు బైపిసిలో చేరవచ్చునని తెలిపారు. తమ కళాశాలలో ఉచిత విద్యతోపాటు హాస్టల్ సౌకర్యం కూడా ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి పెదిపాడు, గోగినేనివారి పాలెం, అక్కచెరువుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 961 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 878 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 83 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.323 , కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర కిలో రూ.267.55 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-కొండపి

పాఠశాలలకు సెలవు దినాలలో విద్యార్థులు గ్రంథాలయంలోని ప్రముఖ జీవిత చరిత్ర, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదువుకొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు బి. కోటేశ్వరరావు తెలిపారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో డ్యాన్స్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత కథలు చెప్పించారు. అదేవిధంగా కథల పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాలకు వేలం పాట

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో షాపుల నిర్వాహణకు బుధవారం వేలం పాట నిర్వహించారు. షాపుల వేలం ద్వారా ఆలయానికి రూ. 20,68,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. వాహన పార్కింగ్ రుసుం వసూలు చేసుకునే హక్కు రూ. 8,10,000, కొబ్బరికాయలు పూజా ద్రవ్యములు అమ్ముకునే హక్కు రూ.9,58,000, కూల్ డ్రింక్స్ మరియు ఐస్ క్రీమ్ అమ్ముకునే హక్కు రూ.2,00,000, తలనీలాలు పోగు చేసుకునే హక్కు రూ.1,00,000 కలిపి మొత్తం రూ.20,68,000 ఆదాయం వచ్చినట్లు ఇఒ చెప్పారు. గతేడాది కంటే ఈ సంవత్సరం రూ.2,70,000 ఎక్కువ ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సిద్ధు రమణారెడ్డి, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది వేలం పాట దారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నంలోని బిఎస్ఎం జడ్‌పి ఉన్నత పాఠశాల 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆపదలో ఉన్న స్నేహితుడి కటుంబానికి బుధవారం చేయూతనందించారు. ఈనెల 17న మండల పరిధిలోని అల్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాటారు వెంకట్రావు మృతిచెందాడు. మృతుడితో తోపాటు చదివిన స్నేహితులు, పూర్వ విద్యార్థులు వెంటరావు కుటుంబ సభ్యులకు రూ.36 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పూర్వ విద్యార్థుల ఆర్గనైజేషన్ ద్వారా వెంకట్రావు ఇద్దరు కుమార్తెల పేరు చెరో రూ.15 వేల వంతున పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లు అందజేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. గతంలోనూ ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించినట్లు వారు తెలిపారు. ఆపదలో ఉన్న స్నేహితుల కుటుంబాలకు చేయూతనివ్వడం ద్వారా తత్వ సంబంధాలు కలిగి ఉండవచ్చునని తెలిపారు. స్నేహితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

ఎండలు బాబోయ్ ఎండలు

- ఉదయం నుంచే వీస్తున్న వడగాలులు
- రోహిణి కార్తెలో పెరిగిన ఉష్ణోగ్రతలు
- అడుగు బయట పెట్టాలంటే జంకుతున్న జనం
- మధ్యాహ్నం వేళ కర్ఫ్యూను తలపిస్తున్న రహదారులు



ఎండదెబ్బ నుంచి ఉపశమనానికి సోడాలు తాగుతున్న మహిళలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోహిణి కార్తెలో ఎండల ప్రభావం తీవ్రంగా ఉంది. జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో గల యర్రగొండపాలెం ప్రాంతంలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం ఆరు దాటినా వాతావరణం చల్లబడడం లేదు. పగటి పూట ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటే జనం బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకూ భానుడి భగభగలు పెరిగిపోతున్నాయి. తెల్లవారిందే మొదలు వడగాల్పులు ప్రారంభమవుతున్నాయి. వారం రోజుల కిందట అకాల వర్షాలు కురిసి చల్లబడిన వాతావరణం ఒక్కసారిగా వేడెక్కి భగ్గుమంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెల్లవారుజామున సూర్యోదయం అయ్యిందో లేదో సూర్యుడి భగభగలు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఉదయం నుంచి అడుగు బయట పెట్టాలన్నా జనం జంకుతున్నారు.

ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఉక్కపోత..

గత వారం రోజులుగా వాతావరణం వేడెక్కడంతో రాత్రి, పగలనకా ఉక్కపోత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తీవ్రమైన వడగాలులు లేదా విపరీతమైన ఉక్కపోత



కొబ్బరి నీళ్లకు పెరిగిన గిరాకీ

భిన్నమైన వాతావరణ పరిస్థితి నెలకొనడంతో జనం ఆందోళన చెందుతున్నారు. కరెంటు సరఫరాలో ఏమాత్రం అంతరాయం ఏర్పడినా చెమటలతో ప్రజలు అల్లాడి పోతున్నారు. విద్యుత్ శాఖ ఆఫీసులకు ఫోన్లు చేస్తూ కరెంటు సౌకర్యం మెరుగుపరచాలని కోరుతున్నారు. ఎండవేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగింది. దీంతో సామాన్యుడి బడ్జెట్ గురించి కరెంటు బిల్లుల మోత మోగుతోంది. మరోవైపు ఉక్కపోతతో ఒంట్లోంచి నీరు అంతా చెమట రూపంలో బయటకు వెళ్లిపోవడంతో పలువురు డిహైడ్రేషన్ బారినపడి ఆసుపత్రుల పాలవు తున్నట్టు పలువురు చెబుతున్నారు. మరోవైపు ఎండ ధాటికి మనుషులే గాక పశుపక్ష్యాదులు సైతం విలవిలలాడిపోతున్నాయి. బయటకు వెళ్లేందుకు జనం వెనకడుగు వేస్తూ ఉండడంతో మధ్యాహ్నం సమయాల్లో రోడ్లన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నాయి. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల లాంటి వాటిని చెట్ల నీడలో నిలిపేందుకు వాహనదారులు పోటీపడుతున్నారు. దీంతో యర్రగొండపాలెం పట్టణంలో ఏ చెట్టు కింద చూసిన వాహనాలే దర్శనమిస్తున్నాయి. ఉక్కపోతతో పాటు భారీగా ఎండ వేడిమి పెరగడంతో జనం శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో కూల్‌డ్రింక్స్ దుకాణాలు, జ్యూస్ సెంటర్లు, సోడా బండ్ల వద్ద జనాల రద్దీ కనిపిస్తోంది. వ్యవసాయ కూలీలు, గృహ నిర్మాణాల్లో పనిచేసే కూలీలు ఇతరత్రా పనులు చేస్తున్న కూలీలు ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేసి మధ్యాహ్నం సేద తీరుతున్నారు. చాలామంది కూలీలు ఎండలకు భయపడి పనులు చేయకుండా ఇంట్లోనే నివసిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప జనాలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనాలు రాక వీధి వ్యాపారులు, కూరగాయలు అమ్మేవారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

స్వీయ రక్షణే శ్రీరామరక్ష..

ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉంటేనే మంచిదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. ఏమాత్రం నీరసంగా అనిపించిన వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని వైద్యులు చెబుతున్నారు.

మోగుతున్న ప్రమాద ఘంటికలు..

వాతావరణ శాఖ లెక్కల ప్రకారం ఎండ తీవ్రతల ఆధారంగా ప్రమాదకర స్థాయిని అంచనా వేస్తారు. వేసవిలో 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదైతే దానిని సాధారణంగా పరిగణిస్తారు. 35 నుంచి 40 డిగ్రీల వరకు ఓమోస్తరు ఉష్ణోగ్రతలుగా గుర్తిస్తారు. జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. 42 నుంచి 45 డిగ్రీల వరకు ప్రమాదకరంగా భావిస్తారు. అప్రమత్తత అవసరం. ఇక 45 డిగ్రీలు దాటితే దానిని అత్యంత ప్రమాదకరంగా హెచ్చరికలు జారీ చేస్తారు. బుధవారం యర్రగొండపాలెం ప్రాంతంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉంటే మంచిది. బయటకు వెళ్లినా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒలు మాల్యాద్రి, శర్వాణి

అభిరుచికి తగ్గ రుచులు..
అదిరే పోషకాలతో 'గోరుముద్ద'

ప్రజాశక్తి-కంభం రూరల్

అదిరే పోషకాలు, అభిరుచులకు తగ్గ రుచులతో ప్రభుత్వ పాఠశాలల్లో గోరుముద్ద పథకం నూతన శోభను సంతరించుకోనుందని మండల విద్యాశాఖ అధికారులు మాల్యాద్రి, శర్వాణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని వంట నిర్వాహకులు, సహాయకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం మెనూలోని వంటల తయారీ విధానాలను ప్రముఖ స్టార్ హోటల్ చెఫ్స్ ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను ప్రదర్శించి, వంట తయారీలో పదార్థాల పరిమాణం, రుచి, శుచి తదితర అంశాలలో అత్యుత్తమ నైపుణ్యాలపై అవగాహన కలిగించారు. అనంతరం వంట నిర్వాహకులు తయారుచేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించగా, సామూహిక భోజనాలు చేసి రుచులను ఆస్వాదించారు. కార్యక్రమంలో మంచి రుచులను ప్రదర్శించిన నిర్వాహకులను అభినందిస్తూ బహుమతులను ప్రదానం చేశారు. మెనూ నిర్వహణపై మండల విద్యా శాఖ అధికారులు ప్రత్యేక సూచనలు చేస్తూ, వంద శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనాలు చేసేలా రుచికరమైన వంటలు తయారు చేసేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బి మాల్యాద్రి, కె శర్వాణి, ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు, అకౌంటెంట్ రామచంద్రుడు, సిఆర్పీలు, మండలంలోని కుకింగ్ ఏజెన్సీలు మరియు హెల్పర్లు పాల్గొన్నారు.



స్పోకెన్ ఇంగ్లీషు క్లాసు బోధిస్తున్న ఉపాధ్యాయుడు సూర్య

వేసవి శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసును ఉపాధ్యాయుడు సూర్య బోధించారు. శిక్షణా కార్యక్రమమైన ప్రారంభంలో పిల్లల చేత కథలు చెప్పించడం, కథలు చదివించడం పుస్తక సమీక్ష చేయడం నేర్పించారు. తరువాత చదరంగం, స్కిప్పింగ్, క్యారమ్, ల్యూడో స్నేక్ ఆటలను ఆడించారు. ఈ శిబిరంలో 8 మంది పిల్లలు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు కే సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదరంగంపై శిక్షణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. పది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కథలు చదివించడం, కథలు చెప్పించడం, డ్యాన్స్ చేయించారు. ఫ్యాకల్టీ శేషరెడ్డి మ్యాక్స్, చదరంగంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

'పుల్లలచెరువు'లో 'బెట్టింగ్ రాజా'లు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం మండలంలో పలుచోట్ల బెట్టింగ్ రాజాలు వెలిశారు. వినడానికి ఇది కాస్త విడ్డూరంగా ఉన్నప్పటికీ ముమ్మాటికీ ఇది నిజం. గతంలో పుల్లలచెరువు మండలం జూదాలకు పుట్టిల్లుగా ఉండేది. మండలంలో మట్కా, పేకాట, సరిబేసి, క్రికెట్ పందేలు వేసి ఒకరిద్దరు బాగానే సంపాదించారు. అలాంటి వారిని చూసి ఆకర్షితులైన వందలాది మంది జీవితాలు నాశనమై పలు కుటుంబాలు బజారుపాలయ్యాయి. అప్పట్లో మండలంలో విధులు నిర్వహించిన పోలీసులు జూదంపై ప్రత్యేక దృష్టి సారించారు. అదే విధంగా ప్రస్తుత ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎండి ఫిరోజ్ ఫాతిమా మండలంలో జూద కేంద్రాలు, జూదరులపై ఉక్కుపాదం మోపడంతో మండలంలో జూదం బాగా తగ్గిపోయింది. ఈ నెల 13వ తేదీన రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరగడం, ఆ ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన రానున్నడంతో ఎన్నికల్లో పోటీ చేసిన పలు పార్టీల అభ్యర్థుల జయాపజయాలపై మండల వ్యాప్తంగా లక్షలాది రూపాయలు బెట్టింగ్ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే బెట్టింగ్ వేసేవారు ఒకరిపై ఒకరికి నమ్మకం లేక ఈ బెట్టింగ్ సొమ్ము కొందరి వద్ద భారీ మొత్తంలో కలిపి



ఉంచుతున్నారు. అది ఎంతవరకు వెళ్లిందంటే ఏకంగా మండల కేంద్రంలోని కొన్ని దుకాణాల్లో 10 శాతం, 20 శాతం కమిషన్ తీసుకునే విధంగా కమిషన్ కేంద్రాలు కూడా వెలిశాయని అంటున్నారు. మండలంలో ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతోంది. కొందరైతే ఏకంగా వైసీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ గెలుస్తాడని, మరికొందరు టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు గెలుస్తాడని పోటీలు పడుతూ లక్ష రూపాయలకు రెండు లక్షలు ఇచ్చే విధంగా పలు గ్రామాలలో బెట్టింగ్ వేసినట్లు పలువురు చర్చించుకుం టున్నారు. ఎవరైనా మండలంలో భారీ మొత్తంలో బెట్టింగ్ సొమ్ము కలిపారని పూర్తి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సమాచారం అందజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పుల్లలచెరువు ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా తెలిపారు. జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు మండల వ్యాప్తంగా పలువురి జీవితాల్లో అనూహ్యమైన మార్పులు తేబోతున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం మండలంలో ఎన్ని లక్షల రూపాయలు చేతులు మారుతాయోనని జూదరుల అత్యాశ. ఇది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని మండల వ్యాప్తంగా పలువురు చర్చించుకుంటున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శేషుకుమార్

వేసవి శిక్షణ తరగతులతో ప్రయోజనం

ప్రజాశక్తి-మార్కాపురం

వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులు చదువుల్లో రాణించేందుకు దోహదపడతాయని శ్రీ సాధన డిగ్రీ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ ఎం శేషుకుమార్ అన్నారు. మార్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు బుధవారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ శేషకుమార్ మాట్లాడుతూ శాఖా గ్రంథాలయంలో గ్రేడ్-1 గ్రంథపాలకుడు జివి శివారెడ్డి కృషితో ప్రతిరోజూ ఓ కొత్తదనం విద్యార్థుల్లో నింపేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష చేయించడం, చదరంగం నేర్పించడంతో పాటు బ్రైన్ గేమ్స్ ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు జివి శివారెడ్డి, సామాజిక కార్యకర్త కొల్లి విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో అన్నదాతలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం నామ మాత్రమే
- ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు
- జూదంలా మారిన వ్యవసాయం
- సాంప్రదాయ వ్యవసాయానికి రైతాంగం స్వస్తి
- మళ్లీ కూలీలుగా మారుతున్న కౌలు రైతులు


వ్యవసాయం సాగు చేస్తున్న కౌలు రైతు బాజి రాజు

ప్రజాశక్తి ఇంకొల్లు

గత నాలుగేళ్లుగా వ్యవసాయం చేస్తున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఒకవైపు పకృతి వైపరీత్యాలు, మరోవైపు ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు, సకాలంలో పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడి పోతున్నారు. తెగుళ్ల దెబ్బకు తోడు నకిలీ విత్తనాలు రైతులను అప్పుల ఊబిలో నెట్టేశాయి. దీంతో సాంప్రదాయ బద్ధంగా గత కొన్ని శతాబ్దాలుగా సాగు చేస్తున్న రైతులు వ్యవసాయాన్ని వదిలి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు. గ్రామాల్లో సగం కుటుంబాలపైన ఈ బాటలో ఉన్నారు. గిటుబాటు కానీ వ్యవసాయానికి స్వస్తి చెప్పి ఇతర పనులు ఎంచుకుంటున్నారు. పిల్లలను చదివించుకుంటూ వారి ఉద్యోగాల కొరకు కృషి చేస్తున్నారు. పొరుగు దేశాలు, రాష్ట్రాల్లో సైతం పిల్లలను ఉద్యోగాలకు పంపుతున్నారు. కొంతమంది రైతులు వ్యాపారాల వైపు ద్రుష్టి మరల్చి పట్టణాలకు వలస వెళుతున్నారు. పిల్లల చదువులు, వ్యాపారాలు, ఉద్యోగాల వంకతో గ్రామాలు వదిలి పట్టణాలకు తరలి వెళ్ళిపోతున్నారు. భూమి యజమానులు పంటసాగు నష్టాలు వస్తున్నాయంటూ కౌలు రైతులకు భూములు ఇచ్చి పట్టణాలకు వెళ్తున్నారు. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం నామ మాత్రంగానే ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వాలు ఎవరివైన, పాలకులు ఎవరైనా తమవి రైతుల ప్రభుత్వమని, రైతుల కోసం ఎన్నో చర్యలు చేపట్టామని ప్రకటనలు గుప్పిస్తూ మభ్యపెడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి పెరిగిన పెట్టుబడులు, కూలీల ఖర్చులతో పోల్చుకుంటే ప్రభుత్వం చేసే సాయం నామ మాత్రమే. మిరప, పత్తి, శనగ, పొగాకు వంటి వాణిజ్య పంటలు సాగు చేయాలంటే ఎకరాకు రూ.లక్షల్లో పెట్టుబడి అవుతుంది. అంత పెట్టుబడి పెట్టి సాగుచేసినా వాతావరణం అనుకూలించక ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు వచ్చిన సమయంలో ధరలు గిట్టుబాటు కాక చివరికి రైతులు అప్పుల పాలు కాక తప్పటం లేదని, వ్యవసాయం జూదంలా మారిందని రైతులు వాపోతున్నారు. పరిస్థితులు అనుకూలించి ఆదాయం పొందే రైతులు వందకు ముగ్గురు లేక నలుగురు మాత్రమే ఉంటున్నారు. 90శాతం మంది పైగా రైతాంగం అప్పుల పాలవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిపి రైతులకు కేటాయించే రైతు భరోసా సాయం కేవలం రూ.13500 మాత్రమే. ఇది కనీసం ఒక ఎకరాకు కలుపు కూలీకి కూడా రాని పరిస్థితి ఉంది. లక్షల్లో పెట్టుబడులు అవుతూ రైతులు అప్పుల పాలవుతున్నారు. కొండంత పెట్టుబడులకు గోరంత సాయం చేసి రైతును ఉద్ధరిస్తున్నట్లు ప్రభుత్వాలు ఊదర గొడుతున్నాయని రైతులు అంటున్నారు. నాలుగేళ్లలో చూస్తే అప్పుల పాలైన రైతులే 90 శాతం మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే సాయం ఏపాటికి సరిపోదని, కనీసం తక్కువనుకున్న ప్రస్తుత తరుణంలో కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు రుణమాఫీ చేస్తేనే రైతులు అప్పుల ఊబి నుంచి బయట పడే పరిస్థితి ఉంది.

కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానం

గత కొన్నేళ్లుగా సాగులో వచ్చిన మార్పులతో సాంప్రదాయ వ్యవసాయం చేసేవారు వ్యవసాయానికి దూరమవుతున్నారు. వారి పొలాలను కౌలుకు ఇవ్వటంతో కౌలు రైతుల సాగు ఏటేటా పెరుగుతూ వస్తుంది. సన్నా, చిన్న కారు రైతులతో పాటు ఆయా గ్రామాల్లో కూలీలు సైతం కోద్దో గొప్ప పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటే ఒకరికి కూలికి పోయే కన్నా సొంతగా సాగు చేసుకునే పొలంలోనే పనులు చేసుకోవటం వలన పని డబ్బులతో పాటు పంటలు సరిగా పండి రేట్లు బాగా ఉంటే ఆదాయం వచ్చి తమ కుటుంబం గౌరవప్రదంగా జీవించవచ్చన్న ఆశతో కౌలు వ్యవసాయాన్ని చేస్తున్నారు. మొదట్లో కొంత మందికి కౌలు వ్యవసాయం ఆశాజనకంగా ఉంది. తమ కుటుంబాలు గౌరవప్రదంగా జీవిస్తున్నప్పటికీ రాను రాను వచ్చిన మార్పులతో వారికి వ్యవసాయం కత్తి మీద సాము అయ్యింది. గత నాలుగేళ్లుగా కౌలు రైతులు అప్పుల ఊబిలోకి నెట్టబడ్డారు. అయినా ఎప్పటికప్పుడు పంట పండుతుందని, ధరలు ఉంటే లాభాలు వచ్చి అప్పులు తీరతాయన్న ఆశతో సాగు చేస్తూ ఉన్నారు. కానీ వారి ఆశ ఏటా నిరాశ అవుతుంది. ఈ నాలుగేళ్లలో కౌలు రైతులు పూర్తిగా అప్పుల పాలయ్యారు. దీనికి తగ్గట్టు వారికి ప్రభుత్వం నుంచి అందే కొద్దో గొప్ప సహాయం కూడా అందే పరిస్థితి లేదు. కౌలు రైతు గుర్తింపు కార్డులు అందకపోవటంతో ప్రభుత్వ రాయితీలు కోల్పోవలసి వస్తుంది. వ్యవసాయానికి పెట్టే పెట్టుబడులు కూడా ప్రైవేటు వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలు కడుతూ నష్టపోవలసి వస్తుంది. ఏటేటా వ్యవసాయం ఒక జూదంలా మారిపోతుంది. ఇందులో నష్టపోతున్న కౌలు రైతులు మళ్లీ తమ పొలం కౌలుకు చేయటం కష్టమని తలచి మళ్లీ కూలీలుగా మారుతున్నారు. వ్యవసాయం చేసి అప్పుల పాలై బాధపడే కన్నా రోజువారీ కూలీకి వెళ్లి ఏ రోజు డబ్బులు ఆ రోజు తెచ్చుకొని భార్యా, బిడ్డలతో హాయిగా జీవించవచ్చన్న ఆలోచనలతో మళ్లీ కూలీలుగా మారారు.

కూలీలుగా మారిన కొనికిపల్లె కౌలు రైతులు

కూలీలుగా ఉన్న వాళ్ల కౌలు రైతులుగా మారి దాదాపు దశాబ్ద కాలంపైగా వ్యవసాయం చేశారు. వ్యవసాయంలో నష్టాలు చూశారు. పెట్టిన పెట్టుబడులు చేతికి రాక అప్పుల పాలయ్యారు. వ్యవసాయం చేసి అప్పుల పాలయ్యే కన్నా మళ్లీ కూలి పనులు చేసుకుంటే ఏ బాదా లేకుండా బతకవచ్చన్న ఆలోచనతో దాదాపు 100 మంది కౌలు రైతులు మళ్లీ కూలీలుగా మారిపోరారు. మండలంలోని కొణికి, కట్టవారిపాలెం, నల్లతోటివారిపాలెం కౌలు రైతులే ఉదాహరణ. గత ఏడాది, ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇంకొల్లు, పరిసర గ్రామాలకు బేల్దారి పనుల కోసం కౌలు రైతులు వస్తున్నారు. బేల్దారు పనికి, రంగుల వేయటానికి మగవారికి ఒక్కొక్కరికి రోజుకు రూ.800. అదే మూడు పూటలా పనిచేస్తే రూ.1200 కూలీ వస్తుంది. ఆడ వారికైతే ఒక్కొక్కళ్ళకి రూ.500 ఇస్తున్నారు. మూడు పూటలా పనిచేస్తే రూ.900 ఇస్తున్నారని చెబుతున్నారు. ఒక ఇంట్లో భార్యా, భర్త ఇద్దరు పని చేస్తే రోజుకు రూ.2వేలపైనే వస్తున్నట్లు తెలిపారు. నెలకు 20రోజులు పనికెళితే రూ.40వేలు వస్తున్నాయని చెబుతున్నారు. దీంతో సంపాదించిన సొమ్ముతో వ్యవసాయం చేసి అప్పుల పాలైన అప్పులు కొంత తీర్చుకుంటూ కుటుంబాలు భాగిస్తున్నట్లు కౌలు రైతు బాజీరాజు తెలిపారు.

అర్హత లేకుండానే..కంటి ఆపరేషన్లు

- కనీస సౌకర్యాలు కూడా కరువు
- నేత్ర వైద్యశాలల్లో నిబంధనలకు పాతర

ప్రజాశక్తి -రేపల్లె

అత్యంత సున్నితమైన అవయవాల్లో కన్ను ఒకటి. డిజిటల్ జీవన యుగంలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం సెల్‌ఫోన్ స్ర్కీన్‌పై చూసే పమయం పెరిగింది. దీనికితోడు కాలుష్యం, జీవనశైలి కారణంగా కంటి చూపు సమస్యలు సాధారణం అయ్యాయి. దృష్టి లోపం కారణంగా రోజువారీ జీవనం ప్రభావితం అవుతుంది. కంటి చూపు కాపాడుకోవడం ప్రధానమైనది. కంటి చూపు మందగిస్తే అంతా చీకటిగానే ఉంటుంది. కంటికి సంబంధించి ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సకు ప్రాధాన్యత ఇస్తాం. అలాంటి కంటి వైద్య సేవల పేరుతో కొందరు వ్యక్తులు అర్హతలు లేకుండా కంటి వైద్యం చేస్తున్నారు. ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన కంటి వైద్య సేవలు నేడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి. గ్రామీణులకు అందుబాటులో కంటి వైద్యం చేస్తామంటూ ఆకర్షిస్తున్నారు. కంటి వైద్యం చేయడానికి అవసరమైన కనీస సౌకర్యాలు, పరిజ్ఞానం లేకుండా చేసే వైద్యం పేదల జీవితాల్లో చీకటి నింపుతుందని గ్రామీణ పేదలు ఆరోపిస్తున్నారు. అరకొర సదుపాయాలతో వేలకు వేలు వసూలు చేస్తున్నారు. ఇటీవల పట్టణంలో కంటి వైద్యశాలలు వెలిశాయి. అర్హత, పరిజ్ఞానం లేకుండా పేదల జీవితాలతో ప్రయోగం చేస్తున్నారు. ఇటీవల ఓ ప్రవేటు వైద్యుని వద్ద ఓ మహిళ కంటి ఆపరేషన్ చేయించుకునే క్రమంలో గుండెపోటుకు గురై చనిపోయింది. ఆమెకు గుండె సమస్యలు ఉన్నాయనే ప్రాథమిక పరీక్ష చేయకుండానే ఆపరేషన్ చేయడంతో ఆమె గుండెపోటుకు గురై మరణించిందని ఆమె బంధువులు ఆరోపించారు. మరో కంటి వైద్య శాలలో ఆపరేషన్ వికటించి కంటి ఇంఫెక్షన్ వచ్చి ఓ పేషెంట్ కంటి చూపు కోల్పోయారు. సదరు వైద్యులు పేషెంట్ బంధువులతో రాజీ కుదుర్చుకుని మెరుగైన వైద్యం కోసం రూ.50వేలు చెల్లించి చేతులు దులుపుకున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్న బయటకు రాకుండా నిర్లక్ష, అనర్హ వైద్యులు జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి వైద్యశాలల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

నిబంధనలకు పాతర

కంటి వైద్యానికి ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలు పాటించకుండా నేత్ర వైద్య శాలను ఏర్పాటు చేస్తున్న వారిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అర్హత లేని వాళ్ల నేత్ర వైద్య నిపుణులుగా చలామణి అవుతున్నారు. వాస్తవానికి వారు కంటి పరీక్షలు వరకు చేయాల్సిన డిప్లమో ఇన్ ఆప్తమాలజీ చదువుకుని ఆప్టిమెట్రీషియన్లు వైద్యశాలలు ఏర్పాటు చేసి ఆపరేషన్లు చేస్తున్నారు. కంప్యూటర్ మిషన్లపై కేవలం కంటి పరీక్షలు మాత్రమే చేసే అర్హత ఉంది. దూరదృష్టి, అస్వదృష్టిని మాత్రమే పరీక్షించాల్సిన ఆప్తాల్మిక్ డిప్లమో అసిస్టెంట్లు పేషెంట్లకు మందులు కూడా వ్రాస్తున్నారు. వాస్తవానికి ఆప్తమాలజిస్టుగా పనిచేయడానికి ఎంబిబిఎస్ డిఓ, లేదా ఎంబిబిఎస్ ఎంఎస్, ఎంబిబిఎస్ డిఎన్‌బి అర్హత కలిగిన వ్యక్తులు సర్జరీలు చేయవచ్చు. టెక్నీషియన్స్‌గా పనిచేసేవాళు డిఓఎ అర్హత కలిగి ఉంటారు. వీరితోపాటు జిఎన్‌ఎం, ఎఎన్‌ఎం చదివిన నర్సులు ఉండాలి. ఆప్టికల్ షాప్ నిర్వహించేందుకు గ్రాడ్యుయేషన్ డిగ్రీతో పాటు రెండేళ్ల అనుభవం కలిగిన వ్యక్తులు కంటి వైద్యశాలలో పనిచేయాల్సి ఉంటుంది.

హాస్పటల్ నిర్వహణకు ఎఆర్, ఎన్‌సిటి, స్కాన్, సర్జికల్ పరికరాలు, లేజర్ మిషన్, చేరి యూనిట్ స్లిట్ లాంప్ ఆపరేషన్ థియేటర్, రిఫ్లెక్షన్ సెటప్ పరికరాలు అందుబాటులో ఉండాలి. హాస్పటల్ నిర్వహణకు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోవాలి. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ పర్మిషన్, హాస్పటల్ రిజిస్ట్రేషన్, ఫైర్ ఎన్‌ఓసి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనుమతులు, లేబర్ లైసెన్స్, ఫార్మలైసెన్స్, మున్సిపల్ అనుమతులు విధిగా తీసుకొని హాస్పిటల్ నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా పట్టణంలో నిర్వహిస్తున్న కంటి వైద్యశాలలు, సంబంధిత వైద్యులపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రవేటు కంటి వైద్యశాలలకు ఉన్న అనుమతులు, వైద్య సేవల స్థాయిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న రైతులు

ఖరీఫ్ సాగుకు సిద్ధం

ప్రజాశక్తి - నిజాంపట్నం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు వ్యవసాయం పనులు ముమ్మరంగా చేస్తున్నారు. మే నెలలో వర్షాలు కురటంతో రైతులకు వ్యవసాయ పనులు ప్రారంభించారు. వర్షంతో కొంత మేరకు ఉపయోగం జరిగింది. పొలాలను చదును చేసుకుని ఎరువులు జల్లుతున్నారు. మే నెల చివరికి రావడంతో గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజను ముందుగా ప్రారంభమైనట్లు రైతులు చెబుతున్నారు. పంట కాలువలకు సాగునీరు ముందుగా విడుదల చేస్తే నారు పోసేందుకు రైతులకు ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఒ జి రవీంధర్

కౌంటింగ్‌కు సహకరించాలి

ప్రజాశక్తి - పర్చూరు

జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపుకు అభ్యర్థులు అధికారులు, సిబ్బందితో సహకరించాలని నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అభ్యర్థుల ఏజంట్లతో కౌంటింగ్ ప్రక్రియపై బుధవారం సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, ఈవిఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురించి అభ్యర్థులు, ప్రధాన ఏజంట్లకు వివరించారు. ఫామ్ -18 ద్వారా ఏజంట్లను ప్రతి అభ్యర్థి నియమించు కోవచ్చని తెలిపారు. జూన్ 3 సాయంత్రంలోపు ప్రతి అభ్యర్థి ఏజంట్లను నియమించుకొని సహకరించాలని కోరారు. సమావేశంలో పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాల ఎఆర్‌ఒలు సిహెచ్ సుబ్బయ్య, నాగరాజు, కె సంధ్యశ్రీ, ఎం మెహర్‌బాబు, ఎం ప్రమీల, ఫణింద్రబాబు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు, ఎన్నికల డిప్యూటి తహశీల్దారు పి సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఓ శ్రీనివాసరావు

'నాడు-నేడు'పై సమీక్ష

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

స్థానిక ఎంఇఓ కార్యాలయంలో నాడు, నేడు పనులపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలు తప్పనిసరిగా 12లోపున అనగా స్కూల్ రీఓపెనింగ్ నాటికి ఎలాంటి పెండింగ్ పనులు లేకుండా చూసుకోవాలని ఎంఇఓ ఎ శ్రీనివాసరావు సూచించారు. ఇంకొల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల, నాగండ్ల ఎంపీయుపి పాఠశాలకు అమౌంట్ మంజూరయ్యేటట్లు చూడగలమని ఎంఈఓ హామీ ఇచ్చారు. సమావేశంలో సిబ్బంది, సిఆర్పిలు, నాడు, నేడు పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సూపర్‌స్టార్ కృష్ణ సేవలు నిరుపమానం

దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తొలి కలర్, తొలి సినిమా స్కోప్, తొలి 70 ఎంఎం వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా తెలుగు జాతికి సూపర్ స్టార్ కృష్ణ చేసిన సేవలు నిరుపమానమని దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో సూపర్‌స్టార్ కృష్ణ కళాపరిషత్ ఆధ్వర్యంలో సినీ హీరో కృష్ణ 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొగిలి దేవ, డిప్యూటీ కలెక్టర్ పేరయ్య హీరో కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు డాక్టర్ మొగిలి దేవ సభాధ్యక్షత వహించి మాట్లాడుతూ హీరో కష్ణ అప్పట్లోనే పాన్ వరల్డ్ స్థాయి జేమ్స్ బాండ్ చిత్రాలు, కౌబాయ్ చిత్రాలతో ప్రయోగాలు చేసి తెలుగు సినిమాను ప్రపంచ వ్యాప్తం చేశారన్నారు. అనంతరం పూర్వ కష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయం ఉప కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఐనంపూడి నరసింహం, సంఘ సేవకులు మారెళ్ళ సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, నున్నా ఆంజనేయులు, జాలాది మోహన్, నత్తల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30లోపు ముందస్తు ఏర్పాట్లు పూర్తి

- కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలి
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు ఈ నెల 30వ తేదీ నాటికీ పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం రైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లాలోని అసెంబ్లీ నియోజక వర్గాలు రిటర్నింగ్ అధికారులు, సహా రిటర్నింగ్ అధికారులతో సమావేశమై ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్ల పై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు ఈ నెల 30వ తేదీ నాటకి పూర్తి చేయాలని, అందుకనుగుణంగా సంబంధిత రిటర్నింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి టేబుల్స్ ఏర్పాటు, బ్యారికేడింగ్, సిసి టివి ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎన్నికల ఫలితాల డేటా నమోదు వంటి ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేసే సిబ్బంది ఏర్పాటుతో పాటు ఆ వివరాలను క్రాస్ చెక్ చేసే మరో బందం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని, కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది, రాజకీయ పార్టీల ఏజెంట్స్ ఆయా నియోజక వర్గాల కౌంటింగ్ కేంద్రాలకు సులభంగా వెళ్ళేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ తో కలసి నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ ఆర్.శ్రీలత, ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, గిద్దలూరు, వై పాలెం నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు జివి సుబ్బారెడ్డి, కుమార్, లోకేశ్వర రావు, జాన్ ఇర్విన్, నాగజ్యోతి, డాక్టర్ శ్రీలేఖ, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వర రావు, డిటిసి ఆర్.సుశీల, హౌసింగ్ పీడీ ఈ. పేరయ్య, ఆర్అండ్‌బి ఎస్ఈ దేవానందం, నియోజకవర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కనిగిరి ఆర్టీసీ డిపో పరిశీలన

ప్రజాశక్తి-కనిగిరి

ప్రకాశం జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి.సుధాకర్ బుధవారం కనిగిరి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలో కన్‌స్ట్రక్షన్ జరుగుతున్న పెట్రోల్ బంకును సందర్శించి అక్కడ జరుగుతున్న పని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. డిపోలో ఉన్న మరుగుదొడ్లను, పరిసరాలను సందర్శించి ప్రతిరోజూ డిపో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని బస్ సర్వీసులు, కార్గో కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం వారికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.శివన్నారాయణ, అసిస్టెంట్ మేనేజర్లు పురవస్తు చిన్నయ్యసూరి, రమణమ్మ, ప్రసాద్, రాణి పాల్గొన్నారు.



కనిగిరి ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న సుధాకర్

ఏకాగ్రతను పెంచే చిత్రలేఖనం

- ఫ్రీడమ్ బర్డ్ సంస్థ నిర్వాహకులు మాల్యాద్రి
- కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డ్రాయింగ్ చదువు పట్ల ఏకాగ్రతను పెంచుతుందని ఫ్రీడమ్ బర్డ్స్ సంస్థ నిర్వాహకులు నాయుడు మాల్యాద్రి తెలిపారు. ఒంగోలు ఎల్బీజీ భవన్‌లో కొనసాగుతున్న చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంపులో బుధవారం చిత్రలేఖనంలో మెళకువలను విద్యార్థులకు మాల్యాద్రి నేర్పించారు. డ్రాయింగ్ వేయడానికి సులభమైన పద్ధతులను సూచించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి ఇంద్రాజ్యోతి, ఐద్వా జిల్లా కార్యదర్శి కె. రమాదేవి విద్యార్థులకు ఆటలు, పాటలు నేర్పారు. గురువారంనాడు సెల్ఫ్ డిఫెన్స్‌ను హిమాంసా (ఎవరెస్ట్ శిఖరం అధిరోహితుడు) నేర్పిస్తారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ తెలిపారు.



డ్రాయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న మాల్యాద్రి

సరిపడా 'ఉపాధి' ఏదీ?

పూర్తిస్థాయిలో పనుల్లేక కూలీల ఇబ్బందులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఏడాది ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలకు వేతనాన్ని 300 రూపాయలకు పెంచినప్పటికీ కూలీలకు మాత్రం పూర్తిస్థాయిలో పని లభించడం లేదు. ఒక గ్రూపునకి వారంలో రెండు, మూడు రోజులకు మించి పని లేకపోవడంతో కూలీలు పని కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా సుమారు 1,50,000 పని దినాలను చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం 70 వేల పని దినాలను మాత్రమే అధికారులు పూర్తి చేయగలిగారు. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకం పనిని ప్రారంభించని గ్రూపులు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మండలంలో అధిక శాతం భట్టిప్రోలు, అద్దేపల్లిలోనే కూలీలు ఎక్కువ మంది ఉండగా ఇక్కడ సరైన ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడం కూలీలకు తగిన విధంగా పనులను గుర్తించకపోవడం వల్ల ఈ గ్రామాల్లో పని దినాలు పూర్తిగా తగ్గిపోయాయి. ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో పంట కాలువలు, మురుగు కాలువలు, సాగునీటి కాలువలు మాత్రమే పనులు చేపట్టాల్సి ఉండటంతో పని దినాలు పెరగటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఫామ్ పాంట్స్ (నీటి కుంటలు) ఏర్పాటు చేస్తే పని దినాలు పెరగడమే కాక కూలీలకు ఖచ్చితమైన వేతనం కూడా లభిస్తుందని, వాటిని తీయటానికి రైతులు ముందుకు రాకపోవడంతో పని దినాల సమస్య ఏర్పడిందని ఏపీవో చెబుతున్నారు. కాగా పనిచేసిన దినాలకు వేతనాలు మాత్రం సకాలంలోనే కూలీల ఎకౌంట్లో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి ఉపాధి హామీ చట్టం కింద జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనిని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో

భారీ బందోబస్తు ఏర్పాట్లు

- చీరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీస్ యంత్రాంగం
- ప్రతి పోలీస్ స్టేషన్, సర్కిల్ పరిధిలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు
- డ్రోన్లను ఉపయోగించి అల్లర్లలో పాల్గొన్న వాళ్లు గుర్తింపు..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లాలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ రోజు అనంతరం ఘర్షణలు చోటు చేసుకున్న ప్రాంతాల్లో ఖచ్చితమైన ప్రణాళికతో కట్టుదిట్టమైన బందోబస్తు పెడుతున్నారు. త్రిముఖ పోటీ జరిగి సమస్యాత్మక నియోజకవర్గంగా ఉన్న చీరాలపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. చీరాల నుంచి వైసిపి తరఫున పోటీ చేసిన కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆమంచి కృష్ణమోహన్ మధ్య ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో స్థానికంగా పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చులతో పాటు, చీరాలలో మాక్ డ్రిల్ కూడా చేపట్టారు. గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి చీరాల వచ్చి ఇక్కడి శాంతిభద్రతల విషయమై సమీక్ష చేశారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఓట్ల లెక్కింపు రోజు ఆ తరువాత ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌ల ఏర్పాటుతో పాటు, డ్రోన్లను ఉపయోగించి అల్లర్లలో పాల్గొన్న వారి గుర్తించనున్నారు. ఇప్పటికే పలు నేరాల్లో ఉండి పోలీసులు హెచ్చరించినా మళ్లీ గొడవల్లో పాల్గొంటే వారిని జిల్లా నుంచి బహిష్కరించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. కౌంటింగ్ రోజున అదనపు బలగాలు కూడా జిల్లాలో అందుబాటులో ఉండి విధులు నిర్వహించనున్నారు. జిల్లాకు బయట ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక అధికారులు వస్తున్నారు. కౌంటింగ్ రోజు ఏర్పాటు చేసే బందోబస్తును గత అనుభవాలను దష్టిలో పెట్టుకొని పక్కా ప్రణాళికతో కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెబుతున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి సర్కిల్ ఆఫీస్ పరిధిలో ప్రత్యేక క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు తిరుగుతుంటాయి. రాజకీయ పార్టీ ఆఫీసులు మరియు అభ్యర్థుల నివాసాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లాలో ఎక్కడ కూడా విజయోత్సవ ర్యాలీలు చేయకూడదని, బాణాసంచా కాల్చకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎవరైనా అల్లర్లలో పాల్గొంటే తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, దానిని ఎవరు కూడా వ్యక్తిగతంగా తీసుకొని తమ జీవితాలను పాడు చేసుకోవద్దని, ముఖ్యంగా యువత ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పదేపదే హెచ్చరిస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరగటానికి అవకాశం ఉంటే వెంటనే 100 లేదా 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని ఇవ్వాలని ఎస్‌పి కోరారు.